ప్రజాశక్తి

బుధవారం 27 మార్చి 2024 | 5 | అనంతపురం





సమావేశంలో పాల్గొన్న వైసిపి అసమ్మతి నేతలు

శింగనమల అభ్యర్థిని మార్చాల్సిందే..!

◆వైసిపి అసమ్మతి నేతల పట్టు

◆అడ్డంకులు సృష్టించినా కొనసాగిన సమావేశం

ప్రజాశక్తి-నార్పల, శింగనమల

శింగనమల అధికార పార్టీ రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. అధిష్టానం అభ్యర్థిని ప్రకటించిన రోజు నుంచి అసమ్మతి నేతలు నిరసనగళం విన్పిస్తూనే ఉన్నారు. ప్రస్తుత అభ్యర్థి ఎం.వీరాంజినేయులను మార్చాల్సిందే అంటూ పట్టుబడుతున్నారు. మంగళవారం నాడు ఏకంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైసిపి అసమ్మతి నేతలు సమావేశం నిర్వహించి అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి వద్దని, వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. అభ్యర్థిని మార్చకుంటే శింగనమలలో వైసిపి ఓటమని ఖాయం అని తెలియజేశారు.

సమావేశంకు అనంతలో అనుమతి నిరాకరణ.. శింగనమలలో కొనసాగింపు..!

శింగనమల వైసిపి అభ్యర్థిని మార్చాలని కోరుతూ అసమ్మతి నేతలు అనంతపురంలో మంగళవారం నాడు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మూడు రోజుల ముందు నుంచే సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సమాచారాన్ని నియోజకవర్గంలోని నేతలందరికీ పంపారు. కాగా మంగళవారం నాడు అనంతపురంలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాయకులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా సమావేశం నిర్వహించేందకు అనుమతి లేదంటూ అనంతపురంలోని బళ్లా కన్వెషన్ హాల్‌కు తాళాలు వేశారు. దీంతో వైసిపి అసమ్మతి నాయకులు వారి సమావేశాన్ని అప్పటికప్పుడు శింగనమల నియోజకవర్గ కేంద్రం సమీపంలోని పెద్దమ్మ గుడి వద్దకు మార్చుకున్నారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా సందేశం పంపారు. ఈ సమాచారం అందుకున్న వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలోనే పెద్దమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. నార్పల సత్యనారాయణ రెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, తరిమెల గోకుల్ రెడ్డి, చన్నంపల్లి రాజశేఖర్ రెడ్డి, దళితనాయకులు మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొని అభ్యర్థిని మార్చాలని అధిష్టానానికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతకాలం నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతికి కషి చేసిన వ్యక్తులకు కాకుండా ఎవరో నామినేట్ చేసిన వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడం సరికాదన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల ఆవేదనను అర్థం చేసుకుని జగన్మోహన్ రెడ్డి అభ్యర్థిని మారుస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం నాయకులు అందరూ కలిసికట్టుగా అభ్యర్థిని మార్చాలంటూ నిర్ణయం తీసుకున్నారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి శింగనమల అభ్యర్థిని మారుస్తూ నిర్ణయం తీసుకోవాలని లేకుంటే పార్టీకి నష్టం తప్పదని తెలియజేశారు.

పడిపోతున్న భూగర్భజలాలు..!

◆ సత్య సాయి జిల్లాలో అధికం

◆ అనంతలోనూ తగ్గుతున్న జలం





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. 2023 ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో -1.87 మీటర్లు పడిపోగా సత్యసాయి జిల్లాలో 2.9 మీటర్లు అధికంగా పడిపోయాయి. వచ్చే నెలకు ఇవి మరింత పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో దాహార్తి నెలకొంటోంది సత్యసాయి జిల్లాలో ఓడీసీ తదితర మండలాల్లో ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బోరు బావుల్లోనూ నీరు తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.

వర్షపాతం తక్కువే..!

అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 456 మిల్లీమీటర్లు అయితే 340.41 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. సాధారణం కంటే 23 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 525.71 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 401 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. వర్షాభావం కారణంగా ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించారు. రబీలోనూ కరువు పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ప్రభావం వేసవి మొదలు కావడంతో మరింత తీవ్రమైంది. భూగర్భ జలాలు వడివడిగా పడిపోతున్నాయి. ఫిబ్రవరి నుంచి భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. సీజన్ ప్రారంభంలో 7.39 మీటర్లు వరకు నీళ్ల ఉండేవి. ఫిబ్రవరి మాసంకు 11.91 మీటర్లకు పడిపోయాయి. -1.87 మీటర్లు తగ్గిపోయాయి. సత్యసాయి జిల్లా 7.91 మీటర్ల నుంచి 13.57 మీటర్లు పడిపోయాయి. గత నెలతో పోలిస్తే ఈ నెలకు 2.9 మీటర్ల లోతుకుపోయాయి. మండలాల వారీగా ఎక్స్ప్లాయిటెడ్ గ్రామాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. అనంతపురం జిల్లాలో ఆరు గ్రామాలుంటే, సత్యసాయి జిల్లాలో 42 గ్రామాల్లో ఎక్స్ప్లాయిటెడ్ ఉన్నాయి.

ఎండుతున్న పంటలు... మొదలైన దాహార్తి..

వర్షాభావంతో బోరుబావుల్లోనూ నీటి మట్టం పడిపోతోంది. దీంతో బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామంలో అత్యధికంగా బత్తాయి పంట సాగవుతుంది. అన్ని పంటలు బోరుబావులపైనే ఆధారపడి సాగవుతున్నాయి. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో ట్యాంకర్ల ద్వారా పంటలను కాపాడుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి అనేక చోట్ల మొదలైంది. సత్యసాయి జిల్లాలో 40కిపైగా గ్రామాల్లో నీటి సమస్య ఉంది. అనంతపురం జిల్లాలోనూ మొదలైంది. నీటి సమస్యను అధిగమించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేసామని అధికారులు చెబుతున్నారు.



హిందూపురం పార్లమెంట్

టీడీపీ అధ్యక్షుడిగా బివి.వెంకటరామడు



బివి.వెంకటరాముడు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హిందూపురం పార్లమెంటు టిడిపి అధ్యక్షుడిగా బివి.వెంకటరాముడును నియమించింది. ఈ మేరకు మంగళవారం నాడు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతల్లో మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి ఉన్నారు. ఆయన్ను హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఇటీవల ప్రకటించారు. ఆయన స్థానంలో బివి.వెంకటరాముడును టిడిపి జిల్లా అధ్యక్షునిగా నియమించారు. బివి.వెంకటరాముడు అనేక సంవత్సరాలు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రచార కార్యదర్శిగా ఉన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టిన సమయంలో మీడియా కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పాదయాత్ర కార్యక్రమంలో ఆయన పాలుపంచుకున్నారు. అనేక సంవత్సరాలుగా పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న ఆయనకు ఇప్పుడు హిందూపురం పార్లమెంట్ అధ్యక్ష పదవి దక్కింది. బివి.వెంకటరాముడు 1999లో తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శిగా, 2003లో తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శిగా, 2004 నుంచి 2023 వరకు ఉమ్మడి అనంతపురం తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీ ప్రచార కార్యదర్శిగా, 2022లో రాయలసీమ మీడియా కో-ఆర్డినేటర్‌గా, 2023లో నారా లోకేష్ యువగళం పాదయాత్ర రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా, 2024 నుంచి నారా లోకేష్ శంఖారావం రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ పని చేశారు. జిల్లాలో అందరూ సీనియర్ నాయకులతోనూ సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా బివి.వెంకటరాముడు ఉన్నారు.

15 మంది వాలంటీర్లు, ముగ్గురు కాంట్రాక్టు

ఉద్యోగుల తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల నియామావళిని ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీలు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 15 మంది వలంటీర్లు, ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఎన్నికల నియామవళి, సివిజల్ డిజిటల్ యాప్ ఫిర్యాదులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చర్యలపై మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు ఆయా నియోజకవర్గాల వారీగా మొత్తం 10 ఫిర్యాదులు రాగా, ఇప్పటి వరకు 191 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా పోస్టర్ తొలగింపులు 7025, బ్యానర్లు తొలగింపు 3132, గోడలపై రాతలు తొలగింపు 812, నాయకుల విగ్రహాలు, ఫొటోలకు వస్త్రాలతో కప్పి వేసినవి 4060 ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండల పరిధిలోని వలంటీర్లు బి.వన్నూరుస్వామి, బివన్నేష్, ఎస్.భీమన్న, బంగి వన్నూరస్వామి, మొక శరణ బసవ, వై.హనుమంతు, మొక నాగరాజు, వాల్మీకి భాస్కర్, అడివప్ప గారి ప్రసాద్, గుంతకల్ నియోజకవర్గం గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని 6 మంది వాలంటీర్లు కె.దివాకర్‌రెడ్డి, వై.మహమ్మద్ నవీద్, ఎం.నసీర్ హుస్సేన్, ఎం.దాదా ఖలందర్, సి.రాజేష్‌బాబు, పెనుకొండ షానవాజ్ ఖాన్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న ముగ్గురు ఆర్.రామరాజు, వి.వెంకటరమణ, జి.మధుసూదన్‌రెడ్డిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఇప్పటి వరకూ 36 మంది వలంటీర్లు, రేషన్ డీలర్లు ఐదుగురు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏడుగురు, రెగ్యులర్ ఉద్యోగులు ఒకరిని ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విధుల నుంచి తొలగించామన్నారు. సీ విజల్ యాప్ ద్వారా ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు చేయొద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి వాటిపైనే ఫిర్యాదులు చేయాలని కోరారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు.

'పది' పరీక్షకు 3,074 మంది గైర్హాజరు : డిఇఒ

అనంతపురం సిటీ : జిల్లాలో మంగళవారం జరిగిన పదవ తరగతి బయలాజికల్ సైన్స్ పరీక్షకు 3,074 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. రెగ్యులర్, ప్రయివేట్ కలిపి 36,387 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 3,074 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. కాగా నగరంలోని రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరాతీశారు. డిఇఒ వెంట పరీక్షల విభాగం ఏసీ గోవిందనాయక్ పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-ఉరవకొండ

కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు నివేదికలను సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి ఉరవకొండలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎంయు, సిఆర్‌యు, ఎఫ్ఎంయు, ఎస్‌డబ్ల్యూపియు మొదలైన ఇన్‌ఛార్జిలను, వారి బృందాలతో షిఫ్ట్‌లవారీగా పని చేయాలన్నారు. ఎన్నికల నివేదికలను త్వరితగతిన అందించాలని ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్ని అనుమతులు, ఖర్చులు, మరియు క్లెయిమ్‌ల పరిష్కారం గురించి వివరించారు. ఈ సమావేశంలో ఇఆర్ఓ శిరీషా, తహశీల్దార్ శ్రీనివాసులు, వైసిపి, టిడిపి, బీఎస్పీ, సిపిఐ తదితర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

◆ జిల్లా, మున్సిపల్ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు ◆ కలెక్టర్ ఎం.గౌతమి



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో వేసవికాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వేసవిలో తాగునీటి సరఫరా కోసం కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు క్షేత్రస్థాయి ప్రణాళికలు రూపొందించాలన్నారు. తాగునీటి సరఫరా కోసం అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, అడిగిన వెంటనే నిధులు ఇస్తామన్నారు. ఎక్కడా నీటి ఎద్దడి ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పూర్తి చేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే మండలాల పరిధిలో అవసరమైన చోట చేతిపంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యల కోసం జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌కి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మున్సిపాలిటీలలో కూడా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. నీటిని వథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ 'సేవ్ వాటర్ క్యాంపెయిన్' చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహషాన్ బాషా, డీపీవో ప్రభాకర్ రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ వివేకానందస్వామి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ విప్ కాపు రామచంద్రారెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో

'మెట్టు' ఓటమి ఖాయం

మాజీ విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం


త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఓడిపోవడం ఖాయమని మాజీ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రాయదుర్గంలో మీడియాతో మాట్లాడుతూ తాను 15ఏళ్లుగా వైసిపి ఏర్పడినప్పటి నుంచి రాయదుర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లానన్నారు. ఇక్కడ పార్టీ పునాది ఏర్పడింది తనతోనే అన్నారు. నేడు తానులేని వైసిపి కొత్తగా ఉందన్నారు. మెట్టు గోవిందరెడ్డి 'తల కింద.. కాళ్లు పైకి' చేసి తపస్సు చేసినా రాయదుర్గంలో గెలిచే అవకాశం లేదన్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా మెట్టు గోవిందరెడ్డి తాను ఒక్క ఓటుతోనైనా గెలుస్తానని చెప్పి 15 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. ఇప్పుడు కూడా మెట్టు ఒక్క ఓటుతోనైనా తాను గెలుస్తానని చెబుతున్నాడని, అయితే 15 నుంచి 30 వేల ఓట్ల తేడాతో ఓడిపోవడం ఖాయమన్నారు. టిడిపి తరపున ఎమ్మెల్సీగా నామినేషన్ వేసి తాడిపత్రి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, మున్సిపల్ వార్డు సభ్యుల ఓట్లను డబ్బిచ్చి కొన్నారన్నారు. ఇది రాజకీయ వ్యభిచారం అన్నారు. దీన్ని సమర్థత అనరని, నీచమైన రాజకీయం అంటారని ఎద్దేవా చేశారు. గోవిందరెడ్డికి ఏం మాట్లాడాలో తెలియదన్నారు. ఎపిఐఐసి ఛైర్‌పర్సన్ పదవి చాలా గొప్పదన్నారు. ఆ పదవి వల్ల రాయదుర్గానికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. చేతకాని వాళ్లు సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటారన్నారు. ముమ్ముందు మెట్టు గోవిందరెడ్డి గురించి మాట్లాడే విషయాలు చాలా ఉన్నాయని, త్వరలో చెబుతానన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పామిడి

పామిడి పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామిడిని కరువు మండలంగా ప్రకటించినా అందుకు తగ్గ సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారన్నారు. ముఖ్యంగా పామిడి, కొండాపురం, కొత్తపల్లి గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా పనులు లేక వ్యవసాయ కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలసలను నివారించడానికి మండలంలో అదనపు పనిదినాలతో కరువు పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా కరువు ప్రాంతాల్లో వంద రోజుల ప దినాలతో పాటు అదనంగా 50 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. అలాగే చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకానికి నిధులు, పనులు, వేతనాల్లో కోత పెట్టిందన్నారు. ఫలితంగా వ్యవసాయ కూలీలకు పొట్టపోసుకోవడం గగనంగా మారిందన్నారు. కావున కరువు సహాయక చర్యల్లో భాగంగా కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, ఈశ్వరయ్య, పార్వతి, ఓబులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి ఎంపిడిఒకు ఎపి వ్యకాసం నేతల వినతి



ఎంపిడిఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి వ్య.కా.సం నాయకులు

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

ఎస్‌కెయు విసి కె.హుసేన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిజమైన సేవలు అని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ కె.హుసేన్‌రెడ్డి కొనియాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో ఎస్‌కెయు సమీపంలోని ఆకుతోటపల్లిలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామం పరిసర ప్రాంతాల్లో వారం రోజులపాటు తెలుగు, తులనాత్మక సాహిత్యశాఖ, బిఎడ్ కళాశాల, న్యాయశాఖ, వాణిజ్య శాస్త్ర తదితర శాఖల విద్యార్థులు స్వచ్ఛభారత్, చెట్లు నాటడం, రోడ్లను మరమ్మతు చేయడం, పక్షులకు ఆహారం, నీటి సౌకర్యం కల్పించడం, ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు, పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో విసి హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కర్నూలు, మంత్రాలయం ప్రాంతాల్లో వరదలు వచ్చినప్పుడు చేసిన సేవలు అభినందనీయమన్నారు. అలాగే కరోనా వంటి గడ్డుకాలంలో కూడా వీరి సేవలు అనితర సాధ్యమన్నారు. క్రమశిక్షణతో సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిస్వార్థ సైనికులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.మురళీధర్‌రావు, బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఆర్.సదాశివరెడ్డి, బీ.ఎడ్ కళాశాల అధ్యాపకులు అనితమ్మ, రాముడు, రాజేశ్వరి, శకుంతల, సొలమాన్‌రాజు, శివానంద, నారాయణస్వామి, సుధాకర్, తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్లు కె.జగదీష్, నానీల నాగేంద్ర, బోధన, బోధనేతర సిబ్బంది, తెలుగు, తులనాత్మక సాహిత్య శాఖ, బిఎడ్ కళాశాల, న్యాయశాఖ, వాణిజ్య శాస్త్ర తదితర శాఖల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌కెయు విసి కె.హుసేన్‌రెడ్డి, అధ్యాపకులు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్లూరు

ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మడ్డిపల్లి, గరుగు చింతలపల్లి గ్రామాల్లో డీఎస్పీ పర్యటించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎవరి ఓటు వాళ్లు స్వేచ్ఛగా వేసుకోవాలన్నారు. అలాగాకుండా గొడవలకు పాల్పడితే మీతోపాటు మీ కుటుంబ సభ్యులు కూడా వీధిన పడతారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అలా కాకుండా గొడవలు జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్యే టికెట్ యాదవులకు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుత్తి



మాట్లాడుతున్న యాదవ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసయాదవ్

జనాభా ప్రతిపాదికన గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే టికెట్ యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని యాదవ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ శివారులో ఉన్న అమోఘ్ హోటల్‌లో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన విన్నప ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలో దాదాపు 60వేల మంది యాదవులు ఉన్నారన్నారు. గుత్తి మండలంలో అత్యధికంగా యాదవ జనాభా ఉందన్నారు. గతంలో వాల్మీకి, వైశ్యులు, గౌడ్లు, రెడ్ల పాలన చూశామన్నారు. ఈసారి యాదవ కులస్తులకు కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం మండల గౌరవాధ్యక్షులు డి.రామకృష్ణ, నాయకులు బి.కాంతమయ్య, ఎం.రాము, టి.రాజు, నంద్యాల రమేష్‌యాదవ్, పి.రామకృష్ణయాదవ్, ఎం.మధుసూదన్, ఎం.చంద్రశేఖర్,డి.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులపై వేధింపులు

ప్రజాశక్తి-గుత్తి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల పేరుతో విద్యార్థులపై జరుగుతున్న వేధింపులను ఆపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్ డిమాండ్ చేశారు. 'కార్పొరేట్ కళాశాలలు వద్దు, ప్రభుత్వ కళాశాలలే ముద్దు' అనే అంశంతో ముద్రించిన కరపత్రాలను మంగళవారం పట్టణంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య, నారాయణ కార్పొరేట్ కళాశాలల్లో చదువుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించలేక చాలామంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, మధు, ధన, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా..ఆదరించండి..

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తా.. వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, వెల్లుట్ల గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు భూమిరెడ్డి గారి నాగార్జునరెడ్డి, మడుగుపల్లి నాగేశ్వర్‌రెడ్డి, జెఆర్.పేట సర్పంచి రామానుజన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలనను ఎన్నుకోండి...



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న వెంకటరామిరెడ్డి

అనంతపురం : ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని 4వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధి, ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అనంతపురంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుని ప్రజా సంక్షేమ పాలనతో పాటు, నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అభ్యర్థించారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో వైసిపి నాయకులు మంగళవారం 'ఇంటింటికీ విశ్వ' అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పూలమాలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, జడ్పిటిసి మమత త్రిలోక్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, వైస్ ఎంపిపిలు పుష్పావతి, ఎర్రగుడి నాయకులు అంగడి ఎర్రిసామి, నరిగన్న, నాయకులు మాజీ సర్పంచి అనితమ్మ, వైస్ సర్పంచి వన్నూరుస్వామి, కన్వీనర్లు ఎర్రిస్వామి, నాయకులు రాజగోపాల్, కరుణాకర్, పూల ప్రసాద్, బాబురెడ్డి, గాజుల రాము, భీమన్న, గురుమూర్తి, ఎర్రగుడి, మాజీ సర్పంచి పోతన్న, చంద్రశేఖర్, వన్నూరుస్వామి, వెంకటేష్, శ్రీనివాసులు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

టిడిపి నేతల అక్రమాల వల్లే చేనేత కుటుంబం ఆత్మహత్య

వైసిపి చేనేత విభాగం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి చేనేత విభాగం నాయకులు

తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అన్యాయం, మోసం కారణంగానే అన్నమయ్య జిల్లా మాధవవరం గ్రామంలో చేనేత కార్మికుడు సుబ్బారావు తన కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకున్నారని వైసిపి చేనేత విభాగం నాయకులు ఆరోపించారు. మంగళవారం ఉరవకొండ వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి చేనేత విభాగం నాయకులు మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం మాధవవరం గ్రామంలో చేనేత కార్మికుల కుటుంబం ఆత్మహత్యపై టిడిపి అసత్య ఆరోపణలు చేస్తోందన్నారు. 2015లో సుబ్బారావు మూడెకరాల పొలం కొన్నారన్నారు. అయితే అప్పటి టిడిపి నేతలు అక్రమాలకు పాల్పడి ఆ భూమిని వేరే వ్యక్తుల పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కించారని వెల్లడించారు. ఇటీవల కాలంలో ఆ పొలాన్ని అమ్మాలని ప్రయత్నాలు చేయగా 2017లోనే ఇతరుల పేరుపై ఆన్‌లైన్ అయిందని తేలడంతో కుటుంబం ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు టిడిపి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుబ్బారావు కుటుంబాన్ని తమ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ జింకా విజయలక్ష్మి విరాళాల ద్వారా సేకరించిన రూ.4 లక్షల సొమ్మును కుటుంబానికి అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి చేనేత విభాగం నేతలు చందా చంద్రమ్మ, చంగల మహేష్, ఎంసి నాగభూషణం, మిడతల చంద్రమౌళి, కొత్తపల్లి హరి, గట్టు ఎర్రిస్వామి, నిమ్మల వెంకటరమణ, వేల్పుల వాసుదేవుడు, సాధు వెంకటస్వామి, బీరే శివ, కాసుల అంజి, అరె రాజా, కామర్తి ఎర్రిస్వామి, అమర్నాథ్, గిరెప్ప, పుల్లా బొజ్జన్న, శంకర, బాలాజీ, కరూరు వెంకటేష్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-ఉరవకొండ



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి పావని సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముష్టూరులో వెల్‌నెస్ కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో బయట తిరగడం మానుకోవాలన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం వరకూ బయట ఎండలో తిరగరాదన్నారు. ఆరుబయట ఎక్కువ సమయం పని చేయడం వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. తీవ్రమైన తలనొప్పి, జ్వరం, మగతగా ఉండటం, అధికంగా దాహం వేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నీడ ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. వీలైతే ఓఆర్ఎస్ ద్రావణం తాపాలన్నారు. తర్వాత డాక్టర్ వద్దకు వెళ్లాలన్నారు. ఎండాకాలంలో జనం బయటకు వెళ్లాల్సిన అవసరం ఉంటే కాలికి చెప్పులు ధరించి, గొడుగు వాడాలన్నారు. వెంట నీరు తీసుకెళ్లాలన్నారు. మద్యపానం, ధూమపానం, మసాలా తిండి మానాలని సూచించారు. ఇంట్లో లభించే మజ్జిగ, కొబ్బరి నీరు లాంటివి అధికంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సిహెచ్ఓ హేమలత, శివ, భగవాన్‌దాస్, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది సురేష్, హొన్నూర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-పుట్లూరు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ నారాయణస్వామి

మండలంలో ఎన్నికల ప్రచారానికి నాయకులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తహశీల్దార్ నారాయణ స్వామి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ప్రచార ర్యాలీలు, ప్రచార వాహనాలకు, భారీ కేడ్ ఇంటింటి ప్రచారం, లౌడ్ స్పీకర్, బహిరంగ ప్రదేశాల్లో మీటింగ్, పోస్టర్, హోర్డింగ్, కరపత్రాలు, ప్రచార ఊరేగింపులు, తాత్కాలిక పార్టీ కార్యాలయం ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు దరఖాస్తు ఫారం సువిధ యాప్‌లోగానీ, ఆర్ఓ, ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయాల్లోగానీ పొందవచ్చన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దస్తగిరి, సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పొట్టిపాడు యువకుడికి డాక్టరేట్



అనంతపురం : యోగి వేమన యూనివర్శిటీలో ఎం.ఎ ఇంగ్లీష్ పూర్తి చేసిన పొట్టిపాడుకు చెందిన కుమ్మర నరేష్‌కు అనంతపురం జెఎన్‌టియు ఇంగ్లీష్ విభాగంలో మంగళవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నరేష్ ప్రముఖ ఆంగ్ల రచయిత కె.వి రఘుపతి రచనల్లోని ముఖ్యాంశాల (సెలెక్ట్ పోయమ్స్ ఆఫ్ కె.వి.రఘుపతి ఏ థెమేటిక్ స్టడీ) గురించి పరిశోధన చేశారు. బెంగళూరు, ప్రెసిడెన్సీ యూనివర్శిటీ ఇంగ్లీషు ఆచార్యులు జి.హంపమ్మ, జెఎన్‌టియు హుమానిటీస్ విభాగం ఆచార్యులు వి.బి.చిత్ర, తిరుపతి పద్మావతి యూనివర్శిటీ ఇంగ్లీష్ విభాగం ఆచార్యులు వైఎస్ శారద ఆధ్వర్యంలో జరిగిన మౌఖిక పరీక్ష అనంతరం (వైవా) నరేష్‌కు డాక్టరేట్ ప్రకటించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం, జీవన కళ, ఆత్మవిశ్వాసం అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ సౌమ్యశ్రీ మాట్లాడుతూ మహిళల జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామ్‌మూర్తి, అధ్యాపకులు వనజమ్మ, నాగమణి, అనిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

నార్పల : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త తలారి ఓబుళప్ప కుటుంబానికి ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిట్టు రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పిట్టు సాంబశివారెడ్డి, తలారి కుళ్లాయప్ప, నారాయణస్వామి, పెద్దన్న, రఘురాములు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

9మంది వాలంటీర్లపై చర్యలు

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 9 మంది వాలంటీర్లపై చర్యలు తీసుకున్నట్లు ఎంపిడిఓ విజయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు వస్తున్న వార్తలో వాస్తవం లేదన్నారు. మండలంలోని 33 గ్రామాల్లో 282 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. వీరిలో ఇద్దరు రాజీనామా చేయగా 9మందిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వాలంటీర్లు రాయకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనరాదన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ



బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న రామ్మోహన్

శింగనమల : జనసేన పార్టీ యువ నాయకులు తోట రామ్మోహన్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులో రోగుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట ఓబులేసు, మహిళలు నాగశేషమ్మ, శ్రావణి, మద్దిలేటిరెడ్డి, రమేష్, అశోక్, కిరణ్‌కుమార్, సాయిశంకర్, రాయల్ మధు, నాగరాజు, శీను, రాము, శ్రీనివాస్‌నాయక్, రామానాయక్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేత మృతికి నివాళి



నీలకంఠారెడ్డి మృతికి నివాళులర్పిస్తున్న నాయకులు

పామిడి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని అక్కాజాంపల్లి గ్రామానికి చెందిన నీలకంఠా రెడ్డి మృతికి పలువురు వైసిపి నాయకులు మంగళవారం నివాళులర్పించారు. నియోజకవర్గ వైసిపి యువ నాయకులు మంజునాథ్‌రెడ్డి గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపిపి మురళీమోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న చిరంజీవి అభిమాన సంఘం నాయకులు

రాయదుర్గం : మెగా పవర్‌స్టార్, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మెగాస్టార్ చిరంజీవి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని నేతాజీ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బిఎం.నాదల్ ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ అభిమానుల సంఘం పట్టణ అధ్యక్షులు హరికృష్ణ, డిటి గౌతమ్ మాట్లాడుతూ ఈనెల 27న బుధవారం గోనబావి వద్ద ఉన్న సిద్ధి వినాయక ఆలయం బృందావనంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున మెగా అభిమానులు, జన సైనికులు, స్వచ్ఛంద సేవాసంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసుల కవాతు

పెద్దపప్పూరు : మండలంలోని సమస్యాత్మక ముచ్చుకోట, వరదాయపల్లి, చిక్కేపల్లి, చాగళ్ల గ్రామాల్లో మంగళవారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. తాడిపత్రి ఎస్‌డిపిఓ ఉత్తర్వుల మేరకు పెద్దవడుగురు సిఐ రోషన్, ఎస్ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ప్రధాన వీధులు, ముఖ్యమైన కాలనీల్లో పర్యటించి అవగాహన కల్పించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేరాలు ఘోరాలు

మద్యం పట్టివేత



మద్యం వివరాలను వెల్లడిస్తున్న సెబ్ సిఐ శివసాగర్

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. యాడికి చెందిన అజయ్ గుత్తి ఆర్ఎస్‌లో అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా సెబ్ సీఐ శివసాగర్, ఎస్ఐ సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేసి 30 క్వాటర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు. అలాగే అక్రమంగా నాలుగు టన్నుల ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ యజమాని తొండపాడుకు చెందిన టి.ఆరేంద్ర నుంచి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని గనులు, భూగర్భ శాఖ అధికారులకు అప్పగించామని సీఐ వెల్లడించారు.

సపోటా చెట్లు దగ్ధం

నార్పల : మండల పరిధిలోని కురగానిపల్లి గ్రామంలో నర్సిరెడ్డిగారి పద్మనాభరెడ్డి సపోటా తోట మంగళవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. సుమారు 2.64 ఎకరాల్లో 200 సపోటా చెట్లు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. దీంతో దాదాపు రూ.5 లక్షల వరకూ ఆర్థికనష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న రైతు పద్మనాభరెడ్డి దగ్ధమైన తన సపోటా తోట చూసి కన్నీరు మున్నీరయ్యాడు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

పెద్దవడుగూరు : పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని కోనాపురం గ్రామ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి కోనాపురం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.11430 నగదు, సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో సర్వేయర్ మృతి



మృతిచెందిన నారాయణస్వామి

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణస్వామి (30) అనారోగ్యం మంగళవారం మృతిచెందారు. నారాయణస్వామి అనారోగ్యంతో బాధపడుతూ తాడిపత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది, నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

నిత్యావసర వస్తువులు అందజేత



ఆశ్రమానికి దుస్తులు అందజేస్తున్న దాతలు

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమానికి మంగళవారం దాతలు నిత్యావసర వస్తువులను అందజేశారు. పట్టణానికి చెందిన దుర్గంశెట్టి రాజా, డిఆర్ రాజేంద్రశెట్టి కుటుంబ సభ్యులు వంట సరుకులను ఇచ్చారు. అలాగే వృద్ధులకు దుస్తులు అందజేశారు. అనాథాశ్రమానికి ప్రతినెలా రూ.4వేలు విలువజేసే నిత్యవసర వస్తువులు అందజేయనున్నట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మలమ్మ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టు సునీత, జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

మహాదేవివర్మ జయంతి



మాట్లాడుతున్న ఎస్‌వి డిగ్రీ కళాశాల నిర్వాహకులు

అనంతపురం : స్థానిక ఎస్‌వి డిగ్రీ కళాశాలలో మంగళవారం హిందీ విభాగం ఆధ్వర్యంలో మహాదేవివర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ సోమశేఖర్‌రెడ్డి మహాదేవివర్మ గొప్పతనాన్ని వివరించారు. ఇందులో భాగంగా వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వై.మధుసూదన్‌రెడ్డి, కళాశాల ఎఓ శ్రీనాథ్, మురళీధర్, ఆదెప్ప, అధ్యాపక, అధ్యాపకేతర బృందం సభ్యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



విజేలతకు బహుమతులు అందజేస్తున్న శ్రీచైతన్య కళాశాలల ఎజిఎం సుబ్బారెడ్డి

అనంతపురం : శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల (ఎటిపి-7) బ్రాంచిలో ప్రిన్సిపల్ పర్వీన్ ఆధ్వర్యంలో మంగళవారం 'మై స్కూల్ మై ప్రైడ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రినిపాల్ పర్వీన్, డీన్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీలు చేస్తున్న అధికారులు

ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో

ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక నుంచి ఆంధ్రాకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతిస్తున్నారు. కాగా వాహనాల తనిఖీ ఆలస్యం అవుతుండటంతో బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించి ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇన్ని తనిఖీలు చేస్తున్నా కర్ణాటక మద్యం జోరుగా ఆంధ్రాలోకి ప్రవేస్తున్నట్లు సమాచారం. ఈవిషయమై ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, కర్ణాటక మద్యం ఆంధ్రాలోకి రావడం అసాధ్యమన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.